# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు అతిపెద్ద ఎన్నికల సంస్కరణగా కేంద్ర న్యాయశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ అభివర్ణించారు.**

**2.** **గిరిజన తండాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ తెలిపారు.**

**3.** **పేదలకు ప్రజాపంపిణీ విధానంలో అందజేసే బలవర్థక బియ్యంపై వస్తు సేవల పన్ను.. జీఎస్టీ తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జీఎస్టీ మండలిని కోరారు.**

**4.** **వస్తు బట్వాడా సేవల పన్నురేటుపై కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.**

**5.** **ఎన్నికల హామీల్లో కీలకమైన.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలుపై అధ్యయనానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది.**

==========================

దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు అతిపెద్ద ఎన్నికల సంస్కరణగా కేంద్ర న్యాయశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ అభివర్ణించారు. జమిలి ఎన్నికల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఆదాయపన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ రజతోత్సవాలకు హాజరైన కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. జమిలి ఎన్నికల బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘానికి పంపించామని, ఆ నివేదిక రావాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం వేర్వేరుగా ఎన్నికలు జరుగుతుండడంతో అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే మానవవనరుల సద్వినియోగంతో పాటు ప్రజాధనం ఆదా అవుతుందని కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ వివరించారు.

---------------------------

ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఈ నెల 25వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో ఉన్న ఐసీఏఆర్-కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించనున్నారు. అక్కడ సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న 500 మంది రైతులతో ఉపరాష్ట్రపతి ముఖాముఖిలో పాల్గొంటారు. అదే రోజు రాత్రి

కన్నా శాంతివనంలో బస చేసి, 26వ తేదీ ఉదయం ఢిల్లీకి తిరిగి వెళతారు. ఉపరాష్ట్రపతి పర్యటనపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఉపరాష్ట్రపతి పర్యటనకు వివిధ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

-------------------------

గిరిజన తండాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బల్లగరువు గ్రామాన్ని నిన్న ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 105 కోట్ల రూపాయలతో నిర్మించనున్న 19 రహదారులకు పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం బల్లగరువులో గిరిజనులను ఉద్దేశించి ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో డోలీమోతలు లేకుండా అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తామని.. డోలీ మోతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పవన్‌కల్యాణ్ వివరిస్తూ..

వాయిస్ (35సెకన్లు)

-------------------------

ఎన్నికల హామీల్లో కీలకమైన.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలుపై అధ్యయనానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి ఛైర్మన్‌గా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, హెూం మంత్రి అనితను ఉపసంఘంలో సభ్యులుగా నియమిస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ పథకం అమలవుతున్న రాష్ట్రాల్లో మంత్రుల బృందం పర్యటించి.. అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

-------------------------

వచ్చే సంవత్సరం జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందిస్తామని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ పనుల కోసం 900 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచామని వెల్లడించారు. సాగునీటి సంఘాల ఎన్ని కల ద్వారా 60 వేల మంది రైతులకు ప్రాతినిధ్యం కల్పించామని మంత్రి వివరించారు. రాయలసీమకు హంద్రీనీవా ద్వారా సాగు, తాగునీరు అందించేందుకు 2 వేల 500 కోట్ల రూపాయలతో ఈ నెలాఖరులో పనులు ప్రారంభించి.. వచ్చే సంవత్సరం జూన్ నాటికి చేస్తామని రామానాయుడు తెలిపారు.

-------------------------

పేదలకు ప్రజాపంపిణీ విధానంలో అందజేసే బలవర్ధక బియ్యంపై వస్తు, సేవల పన్ను.. జీఎస్టీ తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జీఎస్టీ మండలిని కోరారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్టీ మండలి సమావేశంలో నిన్న ఆయన మాట్లాడుతూ.. ఐదు శాతానికి మించి జీఎస్టీ శ్లాబులో ఉన్న వస్తువుల రవాణాపై రాష్ట్రంలో ఒక శాతం వరద సుంకం విధించాలని కోరారు. ఆవిష్కరణలకు ప్రోత్సాహమిచ్చేలా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహించే పరిశోధనలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సులభతర వాణిజ్య నిర్వహణ విధానంలో భాగంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్లను మరింత సరళం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టాలని మంత్రి కేశవ్ సూచించారు.

---------------------------

బట్వాడా సేవల పన్నురేటుపై కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో నిన్న జరిగిన జీఎస్టీ జాతీయ మండలి సమావేశంలో, ఈకామర్స్ నిర్వాహకుల ద్వారా అందిస్తున్న ఆహార సేవలు, ఇతర వస్తు పంపిణీ సేవలపై విధించే పన్నురేటుపై చర్చ జరిగింది. ఈ అంశం సాంకేతికంగా క్లిష్టమైనదని, పన్ను అమలులో న్యాయం జరగాలంటే అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. ఆయన ప్రతిపాదనను జీఎస్టీ మండలి ఆమోదించింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని చర్చ జరగగా.. ప్రస్తుతం ఉన్న రాష్ట్ర వ్యాట్ పరిధిలోనే కొనసాగించాలని ఉపముఖ్యమంత్రి ప్రతిపాదించడంతో మండలి ఆమోదం తెలిపింది.

---------------------------

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం అయ్యపురాజుపాలెం గ్రామంలోనూ, పొదిలిలోనూ నిన్న నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, పొదిలి మండలంలో 9వేల 400 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తే వాటిలో 706 ఎకరాలలో అక్రమాలు జరిగాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులను రెవెన్యూ సదస్సుల వద్ద అందుబాటులో ఉంచి తక్షణం పరిష్కరించడానికి అవకాశం ఉన్న అర్జీలను పరిష్కరిస్తున్నామని మంత్రి వీరాంజనేయస్వామి వివరిస్తూ..

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

తెలంగాణాలో పేద, చిన్న రైతుల సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో, వారి సంక్షేమం కోసమే భూభారతి బిల్లు తీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూభారతి బిల్లును శాసనమండలి నిన్న ఆమోదించింది. అంతకుముందు బిల్లుపై మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. చట్టం అమల్లోకి వచ్చిన 2–3 నెలల్లో సమగ్ర విధివిధానాలు జారీచేస్తామని చెప్పారు. భూభారతి సాఫ్ట్‌వేర్‌ను ఉన్నతీకరించడానికి 6–9 నెలల సమయం పడుతుందని వెల్లడించారు. మిగిలిన రాష్ట్రాలకు భూభారతి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో త్వరలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను ప్రారంభించనున్నామని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురంలో నిన్న ఆయన నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెనకబడిన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాను తమ ప్రభుత్వం అన్నివిధాలా అభివృద్ధి చేస్తుందని చెప్పారు. అనంతరం పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధునాతన క్రీడాప్రాంగణం నిర్మాణానికి భూమి పూజ చేశారు. నర్సీపురంలో రోడ్డు రవాణా సంస్థ సిబ్బంది శిక్షణ కేంద్రాన్ని రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు.

======================